సాక్షి నంద్యాల

ఆదివారం । 18 । మే । 2025



14 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లాలో శుక్ర వారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 14 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి.



మహిమాన్విత మూర్తి

ప్రజలకు మహిమలు చూపిన మాతృమూర్తి మహా యోగి లక్ష్మమ్మ అవ్వ జాతర ఆదోని పట్టణంలో సోమవారం నిర్వహించనున్నారు.

8లో▸



'విశ్వ'మంత సంబరం

అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా లయ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహిం చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు.

8లో▸

న్యూస్‌రీల్

అన్న ప్రసాద వితరణపై పర్యవేక్షణ



అన్నదాన విభాగం అధికారులకు సూచనలు చేస్తున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలం టెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణపై నిరంతరం పర్యవేక్షణ చేస్తుండాలని అధికారులను ఈఓ శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం రాత్రి అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ అన్నప్రసాద వితరణలో ఆయా వంటకాలన్నీ రుచికరంగా ఉండేటట్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి హాలును కూడా ప్రత్యేకంగా సిబ్బంది ఒకరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. అన్నప్రసాద వితరణకు సంబంధించి సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఉదయం వేళలో అన్న ప్రసాదాలను, సాయంత్రం అల్పాహారాన్ని ఎటువంటి ఆలస్యం కాకుండా భక్తులకు అందజేస్తుండాలన్నారు. భక్తులతో మర్యాదతతో మెలగాలని అన్నప్రసాద వితరణ సిబ్బందిని ఆదేశించారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్యాపిలి: పైసా పైసా కూడబెట్టుకుని చిట్టీలు వేసుకున్న వారికి ఓ వ్యక్తి కుచ్చుటోపీ పెట్టాడు. దీంతో బాధితులు లబోదిబో అంటూ శనివారం ప్యాపిలి పోలీసులను ఆశ్రయించారు. దాదాపు రూ. 35 లక్షలకు పైగా మోసం చేసినట్లు తెలుస్తోంది. ప్యాపిలికి చెందిన సుభాన్ బాషా గత కొద్ది సంవత్సరాలుగా ప్యాపిలిలో పలు వ్యాపారాలు చేస్తూ ప్రజల వద్ద నమ్మకం కుదుర్చుకున్నాడు. దీంతో అతన్ని నమ్మిన పలువురు అతని దగ్గర భారీగా చిట్టీలు వేశారు. చిట్టీ ముగిసినా పలువురికి డబ్బులు ఇవ్వకుండా ఆ డబ్బుకు కూడా ప్రతి నెలా వడ్డీ ఇస్తానని నమ్మబలికాడు. మరి కొందరికి డబ్బులు ఇవ్వకుండా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. చిట్టీలతో పాటు పలువురి దగ్గర భారీ మొత్తంలో అప్పులు కూడా చేశాడు. ఇదిలా ఉండగా గత కొద్దిరోజులుగా ప్యాపిలిలో సుభాన్‌బాషా కనిపించకపోవడం, ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో బాధితులు తాము మోసపోయినట్లు గ్రహించారు. ఈ విషయమై సుభాన్ బాషా తండ్రి సిలార్ బాషాను బాధితులు నిలదీయగా తన కుమారుడు ఎక్కడ ఉన్నాడో తనకు తెలియదని చెప్పాడు. దీంతో బాధితులు బండి నరేంద్ర కుమార్, ఆలా ప్రభాకర్ రెడ్డి, షేక్ ఖాజా హుసేన్,వెంకటేశ్, మలికే సర్వర్ సాహెబ్, పలనాటి అంజనమ్మ, బండి నాగరాజు తదితరులు ఎస్ఐ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. మొదటి సంవత్సరం 10,192 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 9,103 మంది పరీక్షలకు హాజరయ్యారని డీఐఈఓ సునిత తెలిపా రు. 1,089 మంది గైర్హాజరయ్యారయ్యారన్నా రు. అలాగే రెండో సంవత్సరం పరీక్షలకు 2,959 మంది విద్యార్థులకు గాను 2,779 మంది హాజరు కాగా 180 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. శనివారం కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈఓ సునిత తెలిపారు.

మహానందిలో వీకెండ్ సందడి



చిన్న కోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కొనసాగింది. స్థానిక అలంకార మండపంలో వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఆలయ పండితులు, అర్చకులు శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేపట్టారు. రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. యాగశాలలో స్వామి, అమ్మవారి దంపతులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా ఏకాంత సేవ పూజలు చేపట్టారు.

నల్లమలలో అవినీతి అనకొండ



ఉన్నతాధికారుల నిర్లక్ష్యమో, వారి ప్రమేయం ఉందో లేదో తెలియదు కాని ఆత్మకూరు అటవీ శాఖ కార్యాలయంలో ఓ ఉద్యోగి అక్రమాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఏకంగా ఒకే కార్యాలయంలో 15 ఏళ్లుగా పని చేస్తూ ఐదు నెలల క్రితం పదవీ విరమణ పొందిన వ్యక్తి అవినీతి బాగోతం అంతా ఇంతా కాదు. అటవీ శాఖలో పని చేసే ప్రొటెక్షన్ వాచర్లకు, పర్యావరణ రక్షణ, వనసంరక్షణ సమితి.. అటవీ జంతువుల రక్షణ.. ఇలా పలు రకాలుగా ప్రభుత్వం కేటాయించే నిధులను ఆరగించిన ఓ రిటైర్డ్ ఉద్యోగి ఉదంతం అటవీ శాఖలో కలకలం రేపుతోంది.

- ఆత్మకూరు అటవీ కార్యాలయంలో ఫెవికాల్ ఉద్యోగి అక్రమాలు
- పదవీ విరమణతో అవినీతి వెలుగులోకి
- రూ. 6 కోట్ల ప్రభుత్వ నిధులు దారి మళ్లింపు
- ఇటీవల రూ. 20 లక్షలు తిరిగి జమ చేసిన వైనం
- నిందితుడిని కాపాడేందుకు రంగంలోకి దిగిన పచ్చ నేతలు



ఆత్మకూరు ఫారెస్ట్ డివిజన్ కార్యాలయం

ఆత్మకూరురూరల్: నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యంలోని ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పని చేసిన చాంద్ బాషా గతేడాది డిసెంబర్‌లో పదవీ విరమణ పొందారు. అప్పటి వరకు అక్రమాలకు పాల్పడుతూ బయటకు పొక్కకుండా జాగ్రత్తగా నెట్టుకొచ్చాడు. ఆ తర్వాత రికార్డులు పరిశీలించిన సిబ్బందికి మొదట రూ.20 లక్షలు దారి మళ్లించినట్లు గుర్తించి దర్యాప్తు చేపట్టగా తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. బైర్లూటీలోని ఎన్విరాన్‌మెంటల్ మెయింటెనెన్స్ చెక్ పోస్టు నుంచి వసూలైన మొత్తం సర్కిల్ కార్యాలయానికి జమ చేయకుండా ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. ఈ విషయమై చాంద్ బాషాపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన ప్రముఖులు పోలీసులతో మధ్యవర్తిత్వం చేసి అరెస్టును వాయిదా వేయించినట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో దారి మళ్లిందనుకున్న రూ.20 లక్షలు ఆత్మకూరు ఎఫ్‌టీ డీడీ ఖాతాలో తిరిగి జమ చేశారు. ఆపై ముందస్తు బెయిల్ ప్రయత్నాల్లో చాంద్‌బాషా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గత ఐదేళ్లలో అతని అక్రమాలు పరిశీలిస్తే దాదాపు రూ.6 కోట్లు దారి మళ్లించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌కు చెందిన యూనియన్ బ్యాంకు ఖాతా, నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్‌కు చెందిన నంద్యాల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాలు పరిశీలిస్తే గత ఐదేళ్లుగా పెద్ద మొత్తంలో ప్రభుత్వ ధనం ప్రయివేట్ వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు వెలుగు చూసింది. ఆత్మకూరు పట్టణానికి చెందిన చాంద్‌బాషాను ఈ కేసు నుంచి బయట పడేసేందుకు స్థానిక టీడీపీ నేతలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

కుటుంబీకుల ఖాతాలకు నగదు బదిలీ

అటవీశాఖకు చెందిన వివిధ ఆదాయ మార్గాల ద్వారా వచ్చిన నగదు మొత్తాలను చాంద్‌బాషా తెలివిగా తన సమీప బంధువులు, నమ్మకస్తుల ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అటవీశాఖ వాహనాల డీజిల్ కోసమంటూ డీజిల్ అవుట్‌లెట్ లేని సామాన్య గృహిణి ఖాతాకు లక్షల సొమ్ము బదిలీ చేసినట్లు సమాచారం. ఏనాడో మూత పడిన రాకిస్ ఫ్యూయల్స్ అనే పెట్రోల్ పంప్ ఖాతాకు ఒకేసారి రూ.17,40,000 బదిలీ అయ్యాయి. అలాగే హమీదా అనే మహిళ అకౌంట్‌కు పలుదఫాలుగా సుమారు రూ.20 లక్షలు, మగ్బూల్ బాషా ఖాతాకు మరో రూ. 20 లక్షలు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. మూత పడిన ర్యాకిస్ ఫ్యూయల్స్‌ను చాంద్ బాషా కుటుంబ సభ్యులే కొంత కాలం లీజుకు తీసుకుని నడిపారు. హమీదా, మగ్బూల్‌బాషాలు.. చాంద్ బాషకు సొంత సోదరి, సోదరులు కావడం గమనార్హం.

కెమెరాల కొనుగోల్‌మాల్

నల్లమల అభయారణ్యంలో జంతువుల లెక్కింపు, వేటగాళ్ల కదలికలను పసిగట్టేందుకు ఏర్పాటు చేసే ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలా కొనుగోళ్లలోను అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ టెలీ కమ్యూనికేషన్ సంస్థకు అటవీశాఖ ద్వారా ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు కొనుగోలుకు ఇండెంట్ పెట్టారు. అయితే అటవీ శాఖ అనకొండ కన్ను దీనిపై కూడా పడడంతో ఆ సంస్థకు కొంత కమీషన్ ఇచ్చి కెమెరాలు కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఖాతాకు సుమారు రూ.3 కోట్లు..

ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉండే మహేశ్వర ప్రింటింగ్ ప్రెస్ యజమాని శివయ్య, అతని కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు ఏకంగా సుమారు రూ.3 కోట్లకు పైగా నగదు బదిలీ చర్చనీయాంశంగా మారింది. అటవీ శాఖకు అవసరమైన ఓచర్లు, టోల్ టికెట్లు ప్రింట్ చేసి ఇచ్చే శివయ్యకు ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ ఖాతా నుంచి అంత పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ కావడం అటవీశాఖలో చాంద్‌బాషా అవినీతికి పరాకాష్టగా చర్చించుకుంటున్నారు.



రిటైర్డ్ ఉద్యోగి చాంద్‌బాషా

ఐదుగురితో విచారణ కమిటీ ఏర్పాటు

ఆత్మకూరు అటవీడివిజన్‌లో ఒక సామాన్య టైపిస్టుగా దినసరి వేతనంతో చేరిన చాంద్‌బాషా అంచెలంచెలుగా డిపార్ట్‌మెంట్‌లో పదోన్నతులు పొందుతూ చివరకు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు. ఈయన సర్వీస్ చివరి 15 సంవత్సరాలు ఆత్మకూరు అటవీ డివిజన్ ప్రధాన కార్యాలయంలోనే తిష్ట వేసి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. తిరుపతి తదితర ప్రాంతాలకు బదిలీ అయినా డిప్యూటేషన్‌పై ఇక్కడే పని చేయడంతో పైఅధికారులకు విషయం తెలియకుండా పెద్ద మొత్తంలో నగదు బదిలీ చేసుకోవడానికి అవకాశం లభించినట్లు సమాచారం. అక్రమాలు వెలుగు చూడటంతో ఒక ఐఎఫ్ఎస్ అధికారితో దర్యాప్తు చేయించి రిపోర్టు ఉన్నతాధికారులకు పంపిన తరువాతే ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదట రూ.20లక్షలు ఖాతాలు మారినట్లు పేర్కొన్న అధికారులు ఆతరువాత ఇంకొంత నిశితంగా రికార్డుల పరిశీలన చేసి రూ.కోట్లలో అవినీతి జరిగిందని నిర్ధారించారు. ఈ క్రమంలో ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సహాయ కన్జర్వేటర్ సాయిబాబా అటవీదళాల ప్రధానాధికారి పీసీసీఎఫ్ ఏకే నాయక్‌కు సమగ్ర నివేదికను పంపారు. ఈ మేరకు ఆయన ఐదుగురితో కూడిన ఒక దర్యాప్తు కమిటీని నియమించారు. ఆధారాల సేకరణ అనంతరం కేసును సీఐడీకి అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

సమగ్ర నివేదిక అందజేశాం



ఆత్మకూరు అటవీడివిజన్ ప్రధాన కార్యాలయంలో అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన చాంద్ బాషా అక్రమాలపై అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి సమగ్ర నివేదికను అందజేశాం. ప్రభుత్వ సొమ్మును తన సొంత ఖాతాకు మళ్లించడంతో ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అక్రమాలు రూ. కోట్లలో ఉండటంతో ఐదుగురి సభ్యులతో విచారణ కమిటీ దర్యాప్తు చేపడుతోంది. – వి. సాయిబాబా, ప్రాజెక్ట్ టైగర్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

ఆర్భాటాలతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారు

- ఏడాదిగా సంక్షేమం, అభివృద్ధి లేదు
- సంపద సృష్టి అంటూ కూటమి నేతలు హెలికాప్టర్లలో పర్యటనలు
- డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబుకే చెల్లు
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



డోన్: సంపద సృష్టించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా నిర్మిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఆడంబరాలు, ఆర్భాటాలకు పోయి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేశారని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం చిన్న మల్కాపురంలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరైన ఆయన ప్రముఖ పారిశ్రామికవేత్త దొంతిరెడ్డి కృష్ణారెడ్డి ఇంటిలో పాత్రికేయులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కడా కూడా అమలు చేయకుండా ఏడాది కాలంగా ప్రజలను మభ్యపెడుతున్న ఘన చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి నేతలు ఏడాదిగా రాష్ట్రమంతట హెలికాప్టర్లలో గాలికి తిరుగుతూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం అనంతరం ప్రజలను మభ్యపెట్టేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నేరవేర్చకుండానే ఏడాది కాలంలోనే రూ. లక్షల కోట్ల అప్పు చేయడం కూటమి ప్రభుత్వానికి చెల్లిందన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి

రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు బుగ్గన పిలుపునిచ్చారు. అక్రమ కేసులు, దాడులు ప్రజాస్వామ్య పరిరక్షణకు విఘాతం కల్గిస్తాయన్నారు. రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వం ఆరాచక, అవినీతి పాలనకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఉద్యమాలు నడిపేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అన్యాయంగా అమాయకులపై అక్రమంగా కేసులు బనాయించి అధికారంలో స్థిరంగా ఉండాలనుకోవడం భ్రమ అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో పారిశ్రామికవేత్తలు గోపాల్ రెడ్డి, మహానందరెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ప్లాస్టిక్ బాటిళ్లతో ఏర్పాటు చేసిన బెంచ్‌పై కూర్చున్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

పాణ్యం: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం పాణ్యంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో చెత్తను సేకరించారు. స్థానిక మహిళలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నానాటికీ కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. అందరూ మొక్కలు నాటి పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసి బెంచ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీపీఓ శివారెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, ఎంఈఓ కోటయ్య, ఏపీఓ శేషన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలన్నీ అబద్ధాలే!

- రాయలసీమలో ఒక్క సాగుప్రాజెక్టును నిర్మించలేదు
- గోరుకల్లును నిర్వీర్యం చేశారు
- ఆయన పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమిటి?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



కర్నూలు(సెంట్రల్): రాయలసీమలోని తాగునీటి ప్రాజెక్టులన్నీ టీడీపీ చేపట్టినవేనని సీఎం చంద్రబాబునాయుడు అబద్ధాలు ఆడుతున్నారని, ఆయన హయాంలో ఒక్క ప్రాజెక్టును నిర్మించలేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో రాయలసీమలోని చాలా ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. కల్లూరులోని తన నివాసంలో శనివారం కాటసాని విలేకరులతో మాట్లాడారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు ప్రధానమంత్రి ఉన్న సమయంలో పీవీ నరసింహారావు భూమి పూజ చేశారని తెలిపారు. 1994 ముందే కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో కాలువలను పూర్తి చేశారన్నారు. 1994 నుంచి 2004 వరకు చంద్రబాబు అధికారంలో ఉన్నా నీళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. 2004లో సీఎంగా వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి గోరుకల్లు రిజర్వాయర్‌తో ప్రజలకు నీళ్లు ఇచ్చారన్నారు.

హాస్యాస్పదం

ఎస్ఆర్‌బీసీ, హంద్రీనీవా ప్రాజెక్టులను టీడీపీ హయాంలో చేపట్టినట్లు సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం హాస్యాస్పదమని కాటసాని అన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం వైఎస్సార్ హయాంలోనే జరిగిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కర్నూలు పర్యటనకు సీఎం చంద్రబాబు ఎందుకు వచ్చినట్లో అర్థం కావడం లేదన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రం చేయడానికి ఎక్కడి నుంచైనా సందేశం ఇస్తే సరిపోతుందన్నారు. అయితే ఆయన మాత్రం ఆ పనిమీదనే జిల్లా పర్యటనకు వచ్చారని, ఆయన రాకతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఖర్చు వచ్చిందన్నారు. ఎక్కడైనా ముఖ్యమంత్రి పర్యటిస్తే ఆ జిల్లాకు ఏదైనా ప్రాజెక్టు లేదా ఏదైనా సంక్షేమ పథకాన్ని అమలు చేయడానికి వస్తారన్నారు. చంద్రబాబు మాత్రం రైతు బజార్‌ను శుభ్రం చేయడానికి రావడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కేవలం ప్రచార ఆర్భాటం కోసమే చంద్రబాబునాయుడు జిల్లాల్లో పర్యటిస్తున్నారని, సంక్షేమ పథకాలను ఎవరూ అడగకూడదని ఆగస్టు, జూన్ అంటూ చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.



కమనీయం.. పాండురంగడి చక్రస్నానం

కోనేరులో స్వామివారి శ్రీచక్రస్నాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో శనివారం వసంతోత్సవం, స్వామివారి చక్రస్నాన్న కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పాండురంగడికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారి వసంతోత్సవాన్ని నిర్వహించి భక్తులు రంగులు చల్లుకున్నారు. వేసవికాలంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుని 11 రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో కల్యాణం, వాహన సేవలు, రథోత్సవ కార్యక్రమాల్లో స్వామివారి వేడిని చల్లార్చేందుకు, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోనేటిలో చేపట్టిన చక్రస్నాన కార్యక్రమం కమనీయంగా కొనసాగింది. రాత్రి ధ్వజారోహణ, కంకణ నిమజ్జనం, నాకబలితో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణంతోపాటు చుక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోనేటి ప్రాంగణం జనసంద్రమైంది.

కక్ష సాధింపుతోనే అక్రమ అరెస్టులు

- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్ అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ కక్షసాధింపులో భాగంగానే రిటైర్డ్ అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిని అరెస్ట్ చేయించారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆరోపించారు. శిల్పా నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ప్రజలకు చెప్పుకోదగిన మేలు ఏమి చేయలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మొహం చాటేశారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ఎవరైనా మాట్లాడితే వారిపై తప్పుడు కేసులు నమోదు చేయటం దౌర్భాగ్యమన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని ఏదో ఒక సమస్యలు చూపించి మభ్యపెడుతున్నారని వివరించారు. అసలు స్కామ్‌లే లేనిచోట లిక్కర్‌స్కామ్‌ల పేరుతో డ్రామా మొదలు పెట్టి కక్ష సాధింపు కోసం ఇద్దరు రిటైర్డ్ అధికారులను అరెస్ట్ చేసి దాన్ని భూతద్దంలో ప్రజలకు చూపించటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుతో పాటు స్కిల్ స్కామ్‌లో నిందితులను కేంద్రప్రభుత్వమే గతంలో అరెస్టులు చేపట్టిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులు లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయం కోసం పల్లెల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తుందని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

ఆధారాలు లేకపోయినా వేధింపులు

అధికారులపై కూడా కూటమి ప్రభుత్వం రాజకీయ రంగుపులిమి కేసుల నమోదుతో పాటు సరైన పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయటం మంచిది కాదన్నారు. సోషల్‌మీడియాలో ఆక్టివ్‌గా ఉన్నవారిపై ఒక్కో వ్యక్తిపై 17 కేసులు నమోదు చేసి చిత్రహింసలకు గురిచేయటం దారుణమన్నారు. సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, మాజీ బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, అనిల్ అమృతరాజ్, కౌన్సిలర్లు బషీద్, మజీద్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి కొత్తూరులో మహా కుంభాభిషేకం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ మహాకుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ రామకృష్ణ శనివారం తెలిపారు. ఆలయంలో రాజగోపుర కలశప్రతిష్ఠ, మహా కుంభాషేకం కార్యక్రమంలో భాగంగా సోమవారం గణపతిపూజ, యాగశాల ప్రవేశం, 20వ తేదీన మంగళవారం స్వామి వారికి విశేష పూజ, కలశపూజ, ధాన్యదివాసం, మహా మంగళహారతి, వితరణ ఉంటుందన్నారు. 21న రాజగోపుర కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

క్లుప్తంగా

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ నుంచి శిక్షణ మొదలవుతుందని, 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు 10వ తరగతి పాసైన యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు బి.తాండ్రపాడు సమీపంలోని కెనరా బ్యాంకు–గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(డీఆర్‌డీఏ–టీటీడీసీ ప్రక్కన)లో సంప్రదించవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 63044 91236 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి



మృతదేహాన్ని వెలికి తీస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరురూరల్: వెంకటాపురం గ్రామంలో శనివారం ఓ బాలుడు ప్రమాదవశాత్తూ బావిలో మునిగి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన కుందూరు రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు కుందూరు చరణ్ రెడ్డి(15) తొమ్మిదో తరగతి పూర్తి చేసి పదో తరగతికి వెళ్లాల్సి ఉంది. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో ఊరు శివారులోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లాడు. అయితే ఈత అంతగా రాని చరణ్ రెడ్డి బావిలో దూకడంతో నేరుగా నీటిలో మునిగి బురదలో చిక్కుకున్నాడు. దీంతో ఊపిరాడక మరణించాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మహాయోగి.. మహిమాన్విత మూర్తి

- రేపు ఆదోనిలో లక్ష్మమ్మ అవ్వ జాతర
- భారీగా తరలిరానున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మమ్మవ్వ మూలవిరాట్

ఆదోని అర్బన్: మహిమలు చూపిన మాతృమూర్తి మహాయోగి లక్ష్మమ్మ అవ్వ. ఆదోని పట్టణంలో సోమవారం అవ్వ జాతర నిర్వహించనున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు.

దళితుల ఇంట పుట్టి....

లక్ష్మమ్మ అవ్వ ఆలూరు మండలం మూసానహళ్లి గ్రామంలో దళితులు మంగమ్మ, బండెప్ప దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుంచే మౌనంగా ఉండడంతో గ్రామస్తులు తిక్కమ్మగా పిలిచేవారు. లక్ష్మమ్మ అవ్వను కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప గ్రామానికి చెందిన యువకుడు మారెప్పకు ఇచ్చి తల్లిదండ్రులు వివాహం చేశారు. ఒక రోజు లక్ష్మమ్మ అవ్వ శక్తిస్వరూపిణిగా భర్తకు కనిపించడంతో ఆయన భయపడి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశాడు. దీంతో సిరుగుప్ప నుంచి అవ్వ ఆదోనికి చేరుకుని తన మహిమలు చూపారు.

రేపు రథోత్సవం

లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆదోని పట్టణంలో వెండి రథోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారిని కొలువుదీర్చే మండపాన్ని, ఆలయ సమీపంలోని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య చేయించిన బంగారు కిరీటాన్ని సోమవారం సమర్పించనున్నారు. జాతర సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నారు. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహిస్తున్నారు.

మహాయోగిగా ప్రసిద్ధి..

ఆదోని పట్టణంలో లక్ష్మమ్మ అవ్వ మహిమలు చూపారు. మహాయోగిగా ప్రసిద్ధి చెందారు. దుకాణాల వద్దకు అవ్వ వచ్చిపోతే వ్యాపారం బాగా సాగుతుందనే నమ్మేవారు. అవ్వను కలిసి వేడుకుంటే సంతానం కలిగేదని భక్తులు చెప్పేవారు. ఆదోనిలో రాచోటి రామయ్య వంశీయులు, చాకలి నరసప్ప తదితరులు అవ్వను ఆశ్రయించి దగ్గరుండి సేవలు చేసేవారు. ఓ పెద్ద కుర్చీలో ఉంచి పల్లకీ సేవగా ఊరేగించేవారు. లక్ష్మమ్మ అవ్వ 1933లో జీవసమాధి అయ్యారు. అక్కడే రాచోటి రామయ్య వంశీకులు గుడి కట్టించారు. లక్ష్మమ్మ అవ్వ గుడిలో జీవసమాధి వద్ద ధ్యానం చేసిన వారికి మంచి జరిగేదని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ గర్భగుడికి బంగారు తొడుగు ఏర్పాటు చేసిన దృశ్యం





వెండి రథం

భక్తులకు అన్ని సౌకర్యాలు



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. భగవాన్ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో యోగా సాధన, ధ్యానం, సంగీతం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. జాతరలో నూతన వధూవరులు అవ్వవారిని దర్శించుకుంటారు.

– రాచోటి రామయ్య, ఆలయ ధర్మకర్త

మద్దిలేటయ్య.. కిటకిట!



భక్త జనంతో కిక్కిరిసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రం

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి దర్శనానికి బారులుదీరారు. స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంమార్చన, ఆకుపూజ, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజతో పాటు మహా మంగళహారతి నిర్వహించారు. గోవింద నామస్మరణలతో ఆలయ ఆవరణం మారు మోగింది.

అసంతృప్తి.. అలక!



బైరెడ్డి అనుచరులపై చిందులేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు మాత్రమే ప్రాధాన్యత లభిస్తోందనేందుకు సీఎం చంద్రబాబు పర్యటన అద్దం పట్టింది. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కనీసం కలిసేందుకు కూడా వీలుపడటం లేదని స్వయంగా నాయకులే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు విచ్చేశారు. నిర్దేశించిన సమయం కంటే గంట ఆలస్యంగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు, అధికారులు, కిందస్థాయి కార్యకర్తలు మండుటెండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ సందర్భంగా టెర్మినల్ బిల్డింగ్ వద్ద లోపలికి వెళ్లేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలకు మాత్రమే అనుమతించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తమ అనుచరులను లోపలికి అనుమతించాలని కోరగా, అందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో అధికారులు తయారు చేసిన ప్రొటోకాల్‌పై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నంలో బైరెడ్డి వర్గీయులపై చిందులేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో తన అనుచరులను లోనికి అనుమతించకపోవడంతో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కూడా అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ రెండు ఘటనలతో చంద్రబాబు ను కలిసేందుకు వచ్చిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు నాయకులకే దిక్కులేకుంటే తమ పరిస్థితి ఏమిటని చర్చించుకోవడం కనిపించింది.

వినతిపత్రాలు ఇచ్చేందుకు వెళ్తే అరెస్టులు



సీపీఐ నాయకులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కల్లూరు: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సీపీఐ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సీఎం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప నేతృత్వంలో శ్రీనివాసరావు, మహేష్, బాబయ్య, అశోక్, రాముడు, అలాగే నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ, కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీ బాషా చేరుకున్నారు. వీరిని పోలీసులు అత్యుత్సాహంతో అదుపులోకి తీసుకున్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు సీఎంను కలిసే ఏర్పాటు చేస్తామని చెప్పి ఉలిందకొండ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా సీఎంకు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తే అరెస్టు చేయడం భావ్యం కాదన్నారు. పోలీసులే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ అరెస్టును సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఖండించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు



తల్లితండ్రుల చెంతకు చేరిన అభిరామ్

వెల్దుర్తి: పట్టణంలోని 9వ వార్డు ముల్ల గేరిలో నివాసముంటున్న మూడేళ్ల బాలుడు అభిరామ్ శనివారం మధ్యాహ్నం తప్పిపోయి కొన్ని గంటల్లోనే తల్లితండ్రులు పరుశరాముడు, లుథియాల చెంత చేరాడు. వివరాలు.. అభిరామ్ తన ఇంటి ముందు ఆడుకుంటూ బంధువుల యువకుడితో కలిసి అరకిలోమీటర్ దూరంలోని పోలీస్‌స్టేషన్ సమీప దుకాణానికి వెళ్లాడు. ఆ యువకుడు వెళ్లిపోవడంతో అభిరామ్ ఒక్కడై డోన్ వైపు దారి వెంట ఏడ్చుకుంటూ తిరిగాడు. అక్కడున్న వారు బాలుడ్ని చేరదీసి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించారు. ఎస్ఐ అశోక్ సలహా మేరకు బాలుడి ఫొటోను వాట్సాప్‌లో ఉంచగా తల్లితండ్రులకు సమాచారం అందింది. వెంటనే వారు పోలీస్‌స్టేషన్ చేరుకుని పిల్లవాడ్ని ముద్దాడుతూ ఊపిరి పీల్చుకున్నారు.

‘విశ్వ’మంత సంబరం

- నందడిగా జేఎన్‌టీయూ(ఏ) 14వ స్నాతకోత్సవం



గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ నుంచి పట్టా అందుకుంటున్న నంద్యాల పూజిత కుమార్‌రెడ్డి



కుటుంబీకులతో సెల్ఫీలు తీసుకుంటూ

అనంతపురం: రాయలసీమకే తలమానికంగా నిలిచిన అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (ఏ) 14వ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ చావా సత్యనారాయణ, వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ముఖ్య అతిథి, కాన్పూర్ ఐఐటీ ఎమిరటర్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్. మాధవ్, పాలకమండలి సభ్యులు, డీన్లు వేదికపై ఆశీనులయ్యారు. చాన్స్‌లర్ హోదాలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ఆద్యంతం విద్యార్థులు చప్పట్లతో హోరెత్తించారు. తన ప్రసంగం ప్రారంభంలో జేఎన్‌టీయూ విద్యార్థులు బంగారు బిడ్డలు అంటూ గవర్నర్ అనడం ఆకట్టుకుంది. గౌరవ డాక్టరేట్ డాక్టర్ చావా సత్యనారాయణకి ప్రదానం చేయడం ద్వారా జేఎన్‌టీయూ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 41 బంగారు పతకాలు ఇవ్వగా, 27 బంగారు పతకాలు అమ్మాయిలే సాధించడం గమనార్హం. ఆరు పతకాలు దక్కించుకున్న విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డిని ఉద్దేశించి.. బంగారు పతకాలు చాలా బరువుగా ఉన్నాయంటూ గవర్నర్ సరదాగా వ్యాఖ్యానించారు. జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ‘ద టైమ్స్ ఇండియా వరల్డ్’ ర్యాంకింగ్‌లో వర్సిటీ 801–1000 ర్యాంకు దక్కించుకుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సులో మైనర్ డిగ్రీని ప్రవేశపెట్టామని, అపార్ అనుసంధానంతో అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ‘రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్’లో వర్సిటీ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకోవాలని యువతిపై దాడి

- యువతి కుటుంబ సభ్యులకు గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పెళ్లి చేసుకోవాలని ఒక యువతిపై శనివారం యువకుడు, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఈ ఘటన గుడేకల్ గ్రామంలో చోటుచేసుకోగా.. యువతితో పాటు ఆమె కుటుంబ సభ్యులకు గాయాలు అయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన దావీదు చిన్న కుమార్తె నరసమ్మను అదే కాలనీకి చెందిన చిన్న నల్లన్న అనే యువకుడు కొన్ని నెలల నుంచి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తల్లిదండ్రులు యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నా నల్లన్న చెడుగొడుతున్నాడు. ఇదే విషయంపై యువతి కుటుంబ సభ్యులు నల్లన్న ఇంటికి శుక్రవారం రాత్రి వెళ్లి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం చిన్న నరసన్న తన బంధువులతో కలసి యువతి ఇంటికి వచ్చాడు. కర్రలతో యువతితో పాటు ఆమె అక్క శాంతి, తండ్రి దావీదులపై దాడి చేశారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పట్ట పగలే ఆలయంలో చోరీ

- వెండి కిరీటం అపహరణ

నందవరం: పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇందుకు నందవరం కోటావీధిలోని వీరభద్ర స్వామి దేవాలయాన్ని ఎంచుకున్నారు. స్వామి వెండి కిరీటాన్ని అపహరించారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. వీరభద్ర స్వామికి 75 తులాల వెండి కిరీటం, 70 తులాల వెండి ఆభరణాలు చేయించారు. శనివారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించారు. రూ.80 వేలు విలువ చేసే స్వామి వారికి వెండి కిరీటాన్ని తస్కరించారు. ఆభరణాలు చోరీ చేయాలని చూడగా రాకపోవడంతో వదిలేసి వెళ్లారు. గర్భగుడి ఆలయం తాళాలు ప్రతి రోజు దేవాలయంలోనే భద్ర పరిచేవారని, గమనించిన వ్యక్తులే చోరీ చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



కష్టాన్ని మ‘రుచి’

వారంతా రెక్కల కష్టంతో బతికేవారు. వెల్దుర్తి మండలం అలుగుండు గ్రామం నుంచి కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి పూలు తెంచడానికి వచ్చారు. ఉదయం నుంచి తోటలో పనిచేసి మధ్యాహ్నం వేళ అందరూ ఇలా కలిశారు. ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని పంచుకుని తిన్నారు. ఒకరి కష్టంలో ఒకరు తోడుగా ఉండడం సంగతి ఏమో.. కనీసం కలసి మాట్లాడుకోవడం లేని పరిస్థితులు నేడు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు చేసే వీరిని చూసి అందరూ ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది.

– కల్లూరు